లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు
- 8:30 గంటలకు ఈవీఎంలో ఓట్ల కౌంటింగ్
- ఏర్పాట్లను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్

కౌంటింగ్ సిబ్బందికి రెండో విడుత ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్న అధికారులు

నాగర్‌కర్నూల్, జూన్ 3 : లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి సమీపంలోని నెల్లికొండ వ్యవసాయ మార్కెట్‌లో జరుగనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, 8:30 గంటలకు ఈవీఎంలో నమోదైన ఓట్ల లెక్కింపు ఉంటుందని వెల్లడించారు. ఈ మేరకు సోమవారం కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి పరిశీలించారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, గద్వాల, వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 16 టేబుళ్లు, అలంపూర్, కల్వకుర్తి, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్‌ను సందర్శించారు. ఆయా కౌంటింగ్ హాళ్లలో టేబుళ్లు, బారికెడ్లు, సీసీ కెమెరాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సహాయ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలన్నారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద నియోజకవర్గ వివరాలను తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని, పోస్టల్ బ్యాలెట్ ఓటు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను అభ్యర్థులు, వారి ఏజెంట్లకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఈవీఎంల ఓట్లను ఒక్కో రౌండ్ వారీగా జాగ్రత్తగా లెక్కిస్తూ ప్రతి రౌండ్‌కు ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు వచ్చి సరిచేస్తారని, కౌంటింగ్ ప్రక్రియను యథావిధిగా కొనసాగించాలని తెలిపారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందితోపాటు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో వివిధ కార్యకలాపాల నిర్వహణ కోసం నియమించబడిన వారికి పాసులు అందించాలని, పాసు కలిగి ఉన్న వారినే కౌంటింగ్ సెంటర్‌లోనికి అనుమతించాలని సూచించారు. అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా తుది ఏర్పాట్లను సరిచేసుకోవాలన్నారు. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా పక్కాగా నిబంధనలను పాటిస్తూ, పారదర్శకంగా నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎలాంటి అపశ్రుతులకు తావు లేకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

రెండో ర్యాండమైజేషన్ పూర్తి

నాగర్‌కర్నూల్, జూన్ 3: అబ్జర్వర్ల సమక్షంలో కౌంటింగ్ సిబ్బందికి రెండో నాగర్‌కర్నూల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్, సాధారణ ఎన్నికల పరిశీలకుడు రుచేష్ జైవన్నీ, కౌంటింగ్ అబ్జర్వర్ సత్పాల్‌శర్మ, గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్ సమక్షంలో రెండో ర్యాండమైజేషన్ పూర్తి చేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఓట్ల లెక్కింపుకోసం కౌంటింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియ సోమవారం పూర్తి చేశారు. మంగళవారం జరిగే పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌కు అవసరమైన సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ పూర్తి చేసిన ట్లు నాగర్‌కర్నూల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఎన్ఐసీ సమావేశ మందిరంలో సాధారణ ఎన్నికల పరిశీలకులు, రుచేష్ జైవన్నీ, కౌంటింగ్ అబ్జర్వర్ సత్పాల్‌శర్మ సమక్షంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు సంబంధించిన 7 నియోజకవర్గాల కౌంటింగ్ సిబ్బంది, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ సిబ్బందిని రెండో ర్యాండమైజేషన్ నిర్వహించి ఏడు కౌంటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన 106 టేబుళ్లకు సంబంధించిన కౌంటింగ్ సూపర్‌వైజర్స్ 127, కౌంటింగ్ అసిస్టెంట్స్ 131, మైక్రో అబ్జర్వర్లు 130 సిబ్బందిని కేటాయించారు. 14 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లకు సంబంధించి 16 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 16 మంది అసిస్టెంట్ సూపర్‌వైజర్లు, 16 మంది మైక్రో అబ్జర్వర్లను కేటాయించినట్లు చెప్పారు. ఈ మేరకు కౌంటింగ్ సిబ్బందిని సెకండ్ ర్యాండమైజేషన్ ద్వారా ఆయా నియోజకవర్గాల ఓట్ల లెక్కింపుకోసం ఖరారు చేశారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఈ ప్రక్రియ మొత్తాన్ని స్క్రీన్ ద్వారా చూపించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, వనపర్తి అదనపు కలెక్టర్ నగేశ్, గద్వాల అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, సిబ్బంది ఉన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రతి కార్యకర్తకూ అండగా బీఆర్ఎస్

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి

బిజినేపల్లి/తాడూరు, జూన్ 3 : బీఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వడ్డెమాన్‌లో ఇటీవల చెరువులో ప్రమాదవశాత్తుపడి మృతి చెందిన కుమ్మరి మైబూస్ కుటుంబానికి సోమవారం పార్టీ ఇన్సూరెన్స్ డబ్బులు రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటుందన్నారు. గతంలో బైబూస్ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం పొందడంతో వారి కుటుంబానికి పార్టీ ప్రమాదబీమా పథకం కింద రూ.2లక్షలు మంజూరైందన్నారు. తాడూరుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మహేందర్ భార్య పద్మ వైద్యం వికటించి మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సోమవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, పులేందర్ రెడ్డి, రాజేశ్, తిరుపతిరెడ్డి, నందకిశోర్‌రెడ్డి, విష్ణు, ఊశన్న, వెంకటేశ్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సమావేశమైన 1993-94 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు

బల్మూరు, జూన్ 3 : మండలంలోని కొండనాగుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం 1993-94 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పరిచయం చేసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అర్హులైన ప్రతి సంఘానికి శ్రీనిధి రుణాలు

మాట్లాడుతున్న శ్రీనిధి మేనేజర్ విక్రమ్‌కుమార్

బిజినేపల్లి, జూన్ 3 : ప్రభుత్వ భాగస్వామ్య సంస్థ శ్రీనిధి ద్వారా మహిళా సంఘాలకు అందజేస్తున్నటువంటి అత్యవసర జీవనోపాధి రుణాలు పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు శ్రీనిధి మేనేజర్ విక్రమ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని గంగారంలో సంఘం సభ్యుల ఎలక్ట్రానిక్ డాక్యుమెంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ మహిళా సంఘాల సభ్యులకు బిజినేపల్లి మండలంలోని రూ.5.67కోట్ల రుణంగా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సభ్యులు శ్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకొని జీవనోపాధులను వృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్, ప్రమీలమ్మ, సంఘాల సభ్యులు ఉన్నారు.

పాలిసెట్‌లో కొల్లాపూర్ విద్యార్థికి స్టేట్ ర్యాంక్

సంతోష్

మనోహర్‌రెడ్డి

విజయలక్ష్మి

కొల్లాపూర్ రూరల్/బిజినేపల్లి, జూన్ 6: పాలిసెట్‌లో కొల్లాపూర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో ఉచిత కోచింగ్ తీసుకున్న 102 మంది విద్యార్థులకు మంచి ర్యాంకులొచ్చాయి. కాగా కొల్లాపూర్ మండలం రామాపురానికి చెందిన చంద్రయ్య కుమారుడు సంతోష్‌కు స్టేట్ 141 ర్యాంక్ వచ్చింది. సర్కారు బడిలో చదివిన సంతోష్‌కు స్టేట్ ర్యాంకు రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొల్లాపూర్ ప్రాంతానికి చెందిన 67 మంది విద్యార్థులకు హైదరాబాద్‌లోని మంచి పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్లు వస్తాయని సాయిమేధ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ శశికాంత్ వాల్మీకి తెలిపారు. ఉపాధి విద్య ద్వారా వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. బిజినేపల్లి మండలం వెల్గొండ గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి బైపీసీ విభాగంలో పాలిటెక్నిక్ ఎంట్రెన్స్‌లో 106 మార్కులతో రాష్ట్రస్థాయిలో 248వ ర్యాంకు సాధించాడు. జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు, విద్యార్థిని పలువురు అభినందించారు. అదేవిధంగా మండలంలోని పాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదివిన విజయలక్ష్మి అగ్రికల్చర్ పాలిటెక్నిక్ విభాగంలో 938వ ర్యాంకు, ఇంజినీరింగ్ విభాగంలో 1267 రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. గుడ్లనర్వకు చెందిన విద్యార్థిని పదో తరగతి పరీక్షలో 9.7 జీపీఏ సాధించి పాలిటెక్నికల్ ఎంట్రెన్స్‌లో ప్రతిభ చాటినట్లు పేర్కొన్నారు. కాగా విద్యార్థిని ఎంఈవో భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గాయత్రి, రాజు, పూర్ణచంద్రకళలు అభినందించారు.

అచ్చంపేట రూరల్ : శ్రీశైలం ఘాట్ రోడ్డులో విరిగిపడిన కొండచరియలు

వర్షం.. రైతన్న హర్షం

- బల్మూరులో 66 మి.మీ. వర్షపాతం నమోదు
- పారిన వాగులు
- శ్రీశైలం ఘాట్ రోడ్డులో విరిగి పడిన కొండ చరియలు

అచ్చంపేటరూరల్, జూన్ 3 : శ్రీశైలం డ్యామ్ సమీపంలో అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ఘాట్‌పై ఆది, సోమవారాల్లో కురిసిన వర్షాలకు కొండ చరియలు, పెద్ద రాళ్లు రోడ్డుకు అడ్డంగా పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొండ చరియలు రోడ్డు పడిన సమయంలో ఎటువంటి వాహనాలు రాకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు. పర్యాటకులు, దేవస్థానానికి దర్శనాకి వెళ్లి వచ్చే వారు రాళ్లు ఉండగానే ఎలాగోలా దారి చూసుకొని వెళ్తుండడం గమనార్హం. విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు ముసురు వర్షంలోనే సహాయక చర్యలు చేపట్టి రాళ్లను జేసీబీ సహాయంతో తొలగించడంతో హైదరాబాద్-శ్రీశైలం మధ్య రాకపోకలు యథావిధిగా సాగాయి. అలాగే అచ్చంపేట మండలంలోని బోల్గాట్‌పల్లి, గుంపన్‌పల్లి, చౌటపల్లి గ్రామాల పరిధిలో సోమవారం కురిసిన వర్షానికి వాగులు పొంగిపొర్లాయి. మండలంలోని సింగారం, ఎద్దుమిట్టతండా, పెద్దతండా, ఐనోల్, బొమ్మనపల్లి, బ్రాహ్మణపల్లి, చందాపూర్, రంగాపూర్ గ్రామాల్లో భారీ వర్షాలు కురిశాయి. వాగులు పొంగి దిగువన ఉన్న చంద్రసాగర్‌లో కలిశాయి. వర్షాలు కురువడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

బల్మూరులో..

బల్మూరు, జూన్ 3 : నాగర్‌కర్నూల్ జిల్లాకు నైరుతి రుతుపవనాలు తాకడంతో ఆదివారం రాత్రి మండలంలో 66 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు ప్రారంభం కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయ దుక్కులు చేసుకున్న రైతులు వాటిలో విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

అచ్చంపేట రూరల్ : బోల్గాట్‌పల్లి వద్ద పారుతున్న చంద్రవాగు

విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దాడి

- ఇద్దరిపై కేసు నమోదు

అమ్రాబాద్, జూన్ 3 : విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన పదరలో సోమవారం చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి పదర ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం పదర మండల కేంద్రంలో ఆదివారం రాత్రి గస్తీ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు ఖలీల్, రాజశేఖర్‌పై పదర గ్రామానికి చెందిన వినోద్, విజయ్ దాడి చేశారు. విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లపై దాడి చేయడంతో వారు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా వినోద్, విజయ్‌ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై వెల్లడించారు.

భర్తపై కేసు నమోదు

తిమ్మాజిపేట, జూన్ 3 : తన భర్త వేధిస్తున్నాడంటూ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకున్నది. ఎస్సై నరేందర్‌రెడ్డి కథనం మేరకు మండలంలోని హనుమాన్ తండాకు చెందిన శారదను అమడాలకుంటతండాకు చెందిన లక్ష్మణ్‌కు 18 సంవత్సరాల కిందట వివాహమైంది. అనంతరం శారద సోదరిని కూడా లక్ష్మణ్ వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో భర్త వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. లక్ష్మణ్ మరో వివాహం చేసుకుంటానని, దూషిస్తున్నాడని, ఇంట్లోంచి ఇద్దరినీ గెంటేసినట్లు ఎస్సై తెలిపారు. శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిరుపయోగంగా బారీకేడ్స్

కల్వకుర్తి రూరల్, జూన్ 3 : కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్, బాల్‌రాంనగర్ కాలనీల్లో వేగనియంత్రణకు, ప్రమాదాల నివారణకు వినియోగించే బారీకేడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. కల్వకుర్తి పట్టణంలో ఆయా కాలనీ సమీపంగా ఉన్న ప్రధాన రహదారుల వద్ద ప్రమాదాలను, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో బారీకేడ్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం బారికేడ్లు రహదారులపై కాకుండా ఖాళీ స్థలాల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

రహదారులపై విరిగిపోయిన బారీకేడ్ల స్థానంలో ఖాళీ స్థలాల్లో నిరుపయోగంగా ఉన్న వాటిని వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ

పాఠ్య పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

కల్వకుర్తి, జూన్ 3 : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు సోమవారం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల విద్యాభ్యాసానికి పూర్తి స్థాయిలో అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. మౌలిక వసతులు, సుశిక్షుతులైన అధ్యాపకులు ఉన్నారని చెప్పారు. విద్యార్థులకు ఇంటర్ విద్యాభ్యాసం కోసం కల్వకుర్తి ప్రభుత్వ కళాశాలలో చేరాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఉన్నారు.

నేటి నుంచి ప్రయోగ పరీక్షలు

అచ్చంపేటటౌన్, జూన్ 3 : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం నుంచి ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నట్లు అచ్చంపేట కోఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ దాసరి రాజశేఖర్ సోమవారం ప్రకటనలో తెలిపారు.

ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు నాగర్‌కర్నూల్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఊర్కొండ, జూన్ 3 : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఊర్కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ సోమవారంతో ముగిసింది. పోటీలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాజేశ్, అక్బర్, గౌస్, మల్లేశ్, శ్రీశైలం, సిద్ధు పాల్గొన్నారు.

వేణుగోపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

వేణుగోపాల్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 3 : వేణుగోపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని జాతీయ విద్యా సంఘం ఉపాధ్యక్షుడు హఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో నేషనల్ హైస్కూల్ యాజమాన్యం, సిబ్బంది వేణుగోపాల్‌రెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అహర్నిశలు కృషిచేసిన వ్యక్తి వేణుగోపాల్‌రెడ్డి అని ఆయన సేవలను కొనియ్యాడారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్లాఖాన్, సుబ్బారావు, లక్ష్మయ్య, శ్రీధర్, సాయిబాబు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, సుందరాచారి ఉన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

- ఏవో చిన్నహుస్సేన్

తిమ్మాజిపేటలో విత్తన దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏడీఏ

చారకొండ, జూన్ 3 : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో చిన్నహుస్సేన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలను ఎస్సై రాజశేఖర్‌తో కలిసి తనిఖీ చేసి పత్తి విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగుల మందులు రైతులకు అందుబాటులో ఉంచాలని, విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా లూజు, నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట, జూన్ 3 : మండలంలో విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఏడీఏ పూర్ణచందర్‌రెడ్డి సోమవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాల కంపెనీల వివరాలు, ఎక్కడి నుంచి వచ్చాయి? బ్యాచ్ నెంబర్? తదితర విషయాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ డీలర్లు విధిగా తమ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకొని, అందరికీ కనిపించేలా దుకాణాలలో ప్రదర్శించాలన్నారు. విత్తనాలు, ఎరువులు కొన్న రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏవో కమల్‌కుమార్ పాల్గొన్నారు.

రికార్డులు పక్కాగా ఉండాలి

అచ్చంపేట టౌన్, జూన్ 3 : ఫర్టిలైజర్స్ దుకాణాల్లో రికార్డులు పక్కాగా ఉండాలని వ్యవసాయాధికారి కృష్ణయ్య అన్నారు. సోమవారం అచ్చంపేట పట్టణంలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని, వాటికి రసీదు తీసుకొని భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

చారకొండలో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో చిన్నహుస్సేన్, ఎస్సై రాజశేఖర్

అచ్చంపేట టౌన్ : ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న కృష్ణయ్య

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.

NT-327729-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794